# నిర్మల మొగుడు

ఖంగారు ఖంగారుగా భోజనం చేస్తోన్న భర్త మానసిక పరిస్థితినీ మొహంమీద పడుతున్న వలని వంకీల జుట్టునీ, అదో విధమైన ఆనందాన్నీ అందాన్నీ సూచించే అతని రూపాన్నీ చూసేటప్పటికి జాలి వేసింది నిర్మలకు.

'తాపీగా తినండి. మీ కిష్టమని ఈ గోంగూర పచ్చడికూడా చేశాను. మీరలాగ కంగారుగా తిని వెళ్ళిపోతే నా మనస్సంతా ఏదో బాధపడుతుంది.'

'ఒళ్ళమ్ముకున్నాక తప్పుతుందా మరి! ఆ రావణాబ్రహ్మ ఈ వేళ ఎలాగైనా నన్ను వదలడు లే!'

ఈ రావణాబ్రహ్మ అన్న బిరుదు ఎవరికి చెందుతుందో నిర్మలకి తెలుసు. ఆ పేరు చెబితే తనభర్త ఘోరనివర్షంలో తడిసివచ్చి కూడా గడగడా మరచెంబుడు నీళ్లు తాగుతాడన్న విషయంకూడా తెలుసును. కాని ఎదురుగా తనభర్త అంత కంగారుగా భోజనం సరీగా చెయ్యకుండా వెళ్ళిపోతూంటే ఆమె భరించలేకపోయింది. అందులోనూ జరిగిన రాత్రి అతను అసలు భోజనమే చెయ్యలేదు. దానికి కారణమైన కలహమూ, ఆ కలహంలో మొండిపట్టు పట్టిన తన పాత్రనిర్వహణా, ఆ కోపంలోనే ఇద్దరూ భోజనం మానేసి, ఒకే పెద్ద మంచంమీద ఒకరికొకరు తగలకుండా, ఒకరివైపు ఒకరు తిరగకుండా పడుకుని జరిపిన అసిధారావ్రతనిర్వహణమూ - ఇవన్నీ నిర్మలని పశ్చాత్తప్తురాలినిగా, భర్తయెడ మరీ సుముఖురాలుగా, ప్రేమచేత కరుణచేత ఆర్ద్రహృదయగా చేసివేశాయి. అందులోనూ అందమైనవాడు, జుట్టు ఆ విధంగా మొహంమీద పడేవాడు, అటువంటివాడు తనకి భర్త అయి, తన సర్వస్వమూ అయినపుడు—

'మీరు ఆ కూర మరోసారి కలుపుకుంటే కాని వీల్లేదు. నా మీద ఒట్టు! బోడి వుద్యోగం పోతేపోతుంది—దీని తాతలాంటిది వస్తుంది. ఊఁ మరి కలపండి' అంది.

ఈసారి విసనకర్ర పుచ్చుకొని విసురుతూ అతని పక్కన కూర్చుంది. నవ్వుతూ పట్టుదల పట్టుతూ లాలిస్తూ అతనిచేత తిరిగీ కూర కలిపించింది. 'అయిన ఆలస్యం ఎల్లానూ అయిందిగా! ఇంకో పావుగంట లేటయితే పీకలు తీస్తాడా ఏవిటి. సంసారాల్లో ఎవళ్లకి మాత్రం ఏవో అవసరాలు రాకుండా ఉంటాయా, ఆలస్యాలు అవకుండా ఉంటాయా' అంటూ నొక్కులునొక్కుతూ సన్నగా దీర్ఘం తీసింది.

ఈ ఆర్గ్యుమెంటుని ఏ కోర్టులోనూ ఒప్పుకోరని తెలుసును—కాని కలహానంతరం అందులోనూ ఒకరాత్రి రాత్రి అంతా మౌనంగా వుండి, తిరిగి సంధి కలుపుకున్న తర్వాత భార్యాభర్తలనుభవించే ఆనందం పరికొత్త ప్రేమలోని ఉద్రేకాన్నీ స్వచ్ఛపరిమళాన్నీ కలిగి ఉంటుంది. అటువంటి పునర్నవమైన ఆప్యాయతతో భోజనంపెడుతూంటే, భార్య సన్నని గాజులసవ్వడితో విసురుతూ లాలిస్తూవుంటే వేరే కాంక్షించే స్వరమే లేకపోయింది గంగాధరానికి. ఆఫీసులూ బాధలూ, సమస్యలూ అన్నీ చప్పున ఫేడౌట్ అయిపోయాయి. ఆ కాస్సేపట్లోను అతనికి నిత్యమూ, సత్యమూ అయిన బ్రహ్మానందం గోచరించింది.

## బాలగంగాధర తిలక్

ఈసారి వాళ్ళ కబుర్లు, ఒకసారి మనస్సులోంచి సమస్యా సంకోచాలు దూరమైపోయిన తర్వాత—ఏ అడ్డంకీ లేని నదీప్రవాహంలాగ సాగిపోయాయి. వచ్చే సంక్రాంతి పండుగకి మామగారు ఏంబహుమతి ఇస్తారో అన్న ప్రశ్నమండి, సినిమాలో ఫలానానటి తాలూకు నటన ఎలావున్నదో, పక్కింటావిడ కొనుక్కొన్న కొత్తచీరలోని కొత్త ఫ్యాషన్ విశేషమూ, కో-ఆపరేటివ్ స్కీములో తాము కట్టించబోయే చిన్న సైజు ఇంటికి ఎన్ని గదులు ఉండాలి అన్నంత వరకూ అనవసర అవసర సమాలోచనలన్నీ సాగిపోయాయి. అతను చెయ్యికడుక్కొని లేచేటప్పటికి ఆమె వక్కపొడుం తీసుకొచ్చి ఇచ్చింది. అతను బనీనుధరించేప్పటికి దువ్వెనతో వచ్చి అతని పాపిడి తీసింది. అతను అమెరికన్ జాకెట్ వేసుకొనేటప్పటికి జోళ్లు రెడీగా ఎదురుగా పెట్టింది. అతను ఆమెను ముద్దుపెట్టుకొని 'వస్తాను నిర్మలా' అని యథాలాపంగా అలవాటు చొప్పున గోడమీద టైముచూసేటప్పటికి అతనికి స్పృహవచ్చినట్టు—లేక తప్పినట్టు అయింది. కఠినవాస్తవికత కొరడాతో కొట్టినట్లయింది. అతనినీడ అతని వెనుకనే వచ్చి వెన్నులో పొడిచినట్లయింది. ఉన్న పళంగా కుప్పగా కుర్చీలో కూలి 'పదకొండుంబావు!' అన్నాడు. అతని మొహంలో కత్తివాటుకు నెత్తురుచుక్క లేదు. తెల్లపడిన అతని మొహాన్నీ, పిచ్చిగాచూస్తోన్న అతనికళ్ళనీ చూసి అర్ధాంగి కంగారుపడింది.

'గంటంపావు లేటు! ఆఫీసుకు వెళ్ళేటప్పటికి ఇంకో పావుగంటైనా పడుతుంది. ఇంక ఉద్యోగానికి నీళ్ళువదులుకోవలసిందే. అసలే కోపిష్టిమనిషి. అందులోనూ దొరల పంక్చ్యుయాలిటీ అంటూ ఘస్తాంటాడు. అవతల మొన్న మీవాళ్లు వచ్చినరోజున ఆలస్యం అయినందుకే మండిపడ్డాడు. తుది హెచ్చరిక అని చెప్పాడు మీపాలమీద చెయ్యి వేసి! నాకొంప తవ్వేశావు. ఏ పావుగంటో, అరగంటో ఆలస్యం అయితే సరిచెప్పుకో వచ్చును. ఇప్పుడేమిటి చెయ్యడం?"

నిర్మలకి ఏమీ తోచలేదు. ససంభ్రమ సవిషాద సశంకిత అయి అలాగ నించొనిపోయింది. అతను కణతల్ని రెండుచేతులతోనూ అదిమి పట్టుకున్నాడు. ఈవిధంగా ఆలస్యంగా ఆఫీసుకు దయచేసి—ఆతప్పే మళ్ళీమళ్ళీ చేసి ఉద్యోగం పోగొట్టుకున్న కొత్తది దొరక్క, మాసినగడ్డంతో, అంతకన్న మాసినచొక్కాతో, లోతుకుపోయిన కళ్లతో రోడ్లుకొలుస్తూ మిత్రుల్ని అణాలేనా అడిగి బతుకుతూన్న శంకరం స్మృతిపథంలో మెలిగేటప్పటికి అతనికి ఒక్క నిమిషం నోట రాడలేదు. అతన్ని లాలిస్తూ భోజనం పెడుతూ, అరగంటకన్న ఆలస్యం అవడం లోని వైపల్యాన్నీ, విపత్తునీ చూడలేకపోయానే అని బాధపడుతోంది ఆమె!

'ఛీఛీ—మీ ఆడాళ్ళింతే! వేళాపాళా వేసుకూర్చున్నావు. ఇప్పుడు చీవాట్లు తినాలి. డిస్మిస్ అంటే గొలుసుని ఏ... రావాలి. రేపటినుండీ మెతుకులు ... ఉండవు.'

'అయ్యో నాకేం తెలుసండీ' ... నిర్మల.

'ఏం తెలుసుమరీ! నీ మొగుడేమైనా మెజి... క్టరనుకున్నావా మినిస్టరనుకున్నావా గుమాస్తా అంటే ఏమిటనుకున్నావు. సార్లు చెప్పాను నీకు తొమ్మిదింటికల్లా అవాలనీ—' కోపంతో కేకలు వేసు...



తల్లి కనాతురా

చిత్రకారుడు: వీరిశెట్టి అచ్యుతరావు.

గంగాధరం.

'మరిమీరు తొమ్మిదింటికిగా బియ్యం పట్టించుకుని వచ్చింది—' అంది నిర్మల భయంగా.

మొదట తడితడిగా కనపడి, తర్వాత బలం సంతరించుకుని బిందురూపం దాల్చుకొని, కనుకొలకులనుండి రెండశ్రువులు నిర్మల నిర్మలకపోలాలమీద మెల్లగా జారాయి. గంగాధరానికి గబుక్కున జాలివేసింది. అతనికి ఏ ఊహతట్టినా, ఏ అనుభూతి కలిగినా గబుక్కున కలుగుతుంది.

'ఏదోకోపంలో అన్నాను నిర్మలా. నీతప్పేమీ లేదు. కాశాకొట్టు తెరిచేటప్పటికే యీ వేళ తొమ్మిదయింది. అవునుకాని యిప్పుడేమిటిచెయ్యడం?—' అన్నాడు గంగాధరం.

నిర్మల తడికళ్ళు ఒక్కసారి మెరిశాయి, మంచుపడుతూన్న వేకువపొద్దుమీద చటుక్కున సూర్యకిరణాలు పడ్డట్టు. బిక్కపోయిన ఆమె మొహం ఒక్కసారి వెలుగుతో ఉద్దీప్తమయింది. తనభర్తకి వెలవెలావచ్చే జీతపురాశిని రక్షించే ఒక ఉపాయం ఆమెకి తట్టిఉండాలి.

గంగాధరం ఆశగా ఆమెకేసిచూశాడు. ఊపిరాడకుండా నదిలో కొట్టుకుపోతూన్న అతనికి ఆమెలో స్ఫురించిన ఊహ అనే పడవచెక్కని పట్టుకొని గట్టుకు చేరుకోవాలనుకున్నాడు.

'నాకో ఊహతట్టిందండీ,' అంది నిర్మల.

'నిజంగానా,' ఆతృతగా అన్నాడు గంగాధరం.

'నిజమేనండీ. మా స్కూల్లో యిదివరకు ఓ మేస్టరు ఉండేవాడు. ఆయన చాలా కోపిష్ఠి. పెద్దపెద్ద మీసాలతో గండు మొహంతో అచ్చంగా పెద్దపులిలాగా ఉంటాడు. ఓనాడు నేను స్కూలుకి బాగా ఆలస్యంగా వెళ్లాను. ఆయన కళ్లెర్రచేసి ఎందుకింత ఆలస్యం అయిందని గర్జించాడు. ఒకవేళ ఆడపిల్లనని చెయ్యిచేసుకోకపోయినా, అక్కడ ఎండలో యిసుకలో నుంచోబెడతాడు. మగపిల్లలు ఏడిపిస్తారేమో అని నాభయం, నాకుభయంతో సిగ్గుతో ముచ్చెమటలూ పోశాయంటే నమ్మండి. నాకు చటుక్కున జ్ఞాపకంవచ్చింది ఆయనకి మాతృప్రేమ ఎక్కువనీ, మాతృపూజకన్న జీవితంలో పరమార్థం మరోపాటి లేదనీ— చూడండి మీ రేదో కాంప్లెక్సు గీంప్లెక్సు అంటారు. అలాగ అన్నమాట. అంతే, మా అమ్మ ఊరగాయలుకోసం అటక ఎక్కబోతూ నిచ్చెనమీదనుంచి పడిందనీ, ఆమె కాలికి మర్దనా అదిచేసి, ఆవిడకి భోజనం పెట్టి, నేను అన్నంతిని వచ్చేటప్పటికి ఆలస్యమయిందనీ మాంచి వొడుపుగా అబద్ధంఆడేశాను. దాంతో అంతపెద్దపులీ అహింసావాది అయిన మేక అయిపోయాడనుకోండి. నన్ను దగరకు పిల్చి, నా తలనిమిరి, విద్యార్థులందరికీ నన్నొక ఆదర్శంకింద చూపించి గౌరవించాడు మా మేష్టారు."

ఆమె ఆగింది భర్తకేసి భావయుక్తంగా చూస్తూ. పాపం భయావస్థలో ఉన్న గంగాధరానికేమీ స్ఫురించలేదు.

'ఈ కథకీ నాయేడుపుకీ సంబంధం ఏమిటి?' అన్నాడు విసుగ్గా.

భర్త తెలివితేటల్ని గురించి కొంచెం నిరసనగా, జాలిగానవ్వి, విడమర్చి యిలా చెప్పింది నిర్మల: 'చూడండి, మీ 'బాస్'లో ఎక్కడో వీక్ పాయింటు ఒకటి ఉంటుంది. దానిమీద మీరు 'ప్లే' చెయ్యాలి. ఎంత కోపంలోఉన్నవాడైనా, అతనికి యిష్టమైన ఆప్యాయమైన ప్రసక్తితీసుకువస్తే చటుక్కున మెత్తబడిపోతాడు మా మేష్టారులాగ, ధైర్యం తెచ్చుకోండి ఆలోచించండి.'

గంగాధరానికి ఆమధ్య తోటిగుమాస్తా ఒకడు చెప్పిన విషయం సమయానికి జ్ఞాపకం వచ్చింది. ఒక్క ఉదుటున లేచి ఆమెని వలించుకుని 'మై ప్రెషస్! నువ్వు నిజంగా నన్ను రక్షించడానికి వచ్చిన దేవతవి. అందుకే కార్యేషుమంత్రీ కరణేషుదాసీ (పాపంతిరిగేవాడు కంగార్లో) అన్నారు పెద్దలు, మాఆఫీసరికి ఓ పెద్దవీక్నెస్ ఒకటి వుంది. అదేమిటంటే ఆయనకి చాలాకాలం పిల్లలు లేరు. ఈమధ్యే మూడునాలుగు ఏళ్ళక్రితం ఒకపిల్లాడు కలిగాడు. ఆయనకి పిల్లలు అంటే ఎంతో పిచ్చట. ఆరోజుల్లో మిఠాయీ బొమ్మలు కొని చుట్టుపక్కల ఉన్న పిల్లలకి వారం వారం పంచిపెట్టేవాడుట. ఇప్పటికీ ఈయన ఉన్నవీధిలో ఏ పిల్లవాడికి జబ్బు చేసినా ఈయన స్వయంగావెళ్లి కష్టసుఖాలు విచారించి అవసరమైతే స్వయంగా డాక్టర్నికూడ

# ★ నిర్మల మొగుడు ★

తీసుకు వెళుతాడుట. ఎవరికి కానీ రాల్చని వాడు నిరుపేదు అనాథ శిశు శరణాలయానికి రెండొందలు—టూ హండ్రెడ్—అడగ్గానే ఇచ్చిపారేశాడట. ఏదీ, నా అమెరికన్ పర్సు ఇలా పడెయ్యి. ఓహో బ్యూటిఫుల్ అయిడియా' అంటూ అతనో విధమైన నాట్యం చేశాడు.

'మీరు పర్సు తోడుక్కుపోతున్నారండీ' అంది నవ్వుతూ నిర్మల. గోధుమరంగు పాంటు మీద షార్క్ స్కిన్ కోటు వేసుకుని, జుట్టు అందంగా మొహంమీద పడుతూంటే సైకిలెక్కి సంతోషంగా వెళ్ళే భర్తని చూసి నిర్మల మళ్ళీ ఒకసారి పరిపూర్తిగా ప్రేమించి వింత ఆనందమూ, గర్వమూ పొందింది.

గంగాధరం వచ్చినట్లు తెలిపిన మేనేజరు తనగదిలోంచి గంగాధరాన్ని పిల్చాడు. మంచి ధీమాగా, ఏ సంకోచమూ లేకుండా వెళ్ళే గంగాధరాన్ని చూసి పోవిరగుమాస్తాలంతేతనకళ్ళని తామే నమ్మలేక ఒక్కసారి కళ్ళు నులుముకు చూశారు. వినయంగా మేనేజర్ ముందు నిలబడ్డాడు గంగాధరం.

'నీ ప్రవర్తన నాకు అర్థంకావడం లేదు. నీకు బొత్తిగా భయమూ, భక్తీ లేకుండా పోయాయి. ఇది ఆఫీసనీ, ఇక్కడ నువ్వు జీతగాడివనే స్పృహకూడా నీకు లేనట్లుంది. ఇదివరకు నీకు మూడుసార్లు వార్నింగు ఇచ్చాను. నామాట నీకు లక్ష్యం వుంటేగా. ఇంక నీ విషయంలో కన్సిడరేషన్ ఏమీ చూపలేను. ఇంక నువ్వు ఫలితం అనుభవించక తప్పదు.' అని కోపంగా నిక్కచ్చిగా ఆరోహణావరోహణాలు పాటిస్తూన్న గొంతుతో, మీసం కొసల్ని మెలివేస్తూ కళ్ళెర్రచేస్తూ మాట్లాడే మేనేజరుని చూస్తోంటే, కీచిగా వెనకాలే నడిచివెళ్ళి 'జింకని అమ్మని నోట కరచుకొనే పులిలోని ఒడుపూ, నిశ్చయతూ గంగాధరానికి స్ఫురించే టప్పటికి అతనిగుండె కొన్ని సెకనులు పని చెయ్యలేదు. భయం భయంగా వణికే గొంతుని సరిచేసుకుంటూ ఇలా అన్నాడు.

'చిత్తం...ఏక్సిడెంటు జరిగిందండి.... తమరు క్షమించాలి.

'ఏక్సిడెంటా!' ఎగాదిగా చూశాడు— మేనేజరు. 'నువ్వు బాగానే వున్నావే' అన్నాడు.

'ఆఫీసుకి ఆలస్యమౌతుందేమోనని తొందరగా వస్తున్నానండి. ఎటుక్కున దారికడ్డంగా ఒక చిన్న పిలవాడు వచ్చాడండి. సైకిల్ ఆ కుర్రవాణ్ని ఢీకొన్నదండి.'

ఈసారి అధికారి మొహం మారిపోయింది. ఆతురత, ఆవేదన మొహంలో కనబడ్డాయి. 'ఏమైంది...ఏమైంది' అన్నాడు.

'తలకి, కాలికి గాయాలు తగిలాయండి. ఒకటే రక్తమండి. తక్షణం నా చేతిరుమాలు తలకికట్టి ఆ కుర్రవాణ్ని ఎత్తుకొని హాస్పిటల్ కి వెళ్ళానండి. అక్కడ చికిత్స చేయించి కట్టు కట్టించి, డాక్టరుగారు ఫరవాలేదన్న తర్వాత ఆ కుర్రవాడి యింటికి ఫోన్ చేయించి మరీ వచ్చానండి. ఇంటికి వెళ్ళి బటలు మార్చుకొని....'

'ఏం డేంజరు లేదుగదా. డాక్టరు గట్టిగా చెప్పాడా.' ఫైర్ అలారంలా మోగింది ఆయనగొంతు.

'మరేం ఫరవాలేదండి. అశ్రద్ధ చెయ్యకుండా వెంటనే వైద్యం చేయించాకదండీ. సెప్టిక్ అవకుండా పెన్సిలిన్ యిదీ అదీ ఇంజక్షను ఇచ్చాడండి డాక్టరు.'

'ఆ కుర్రాడు కళ్ళుతెరచి మాటాడుతున్నాడా.'

'చిత్తం... మొదట్లో కొంతసేపు తెలివి లేదండి. ఇప్పుడు మా అమ్మ కావాలి అని అంటున్నాడండి. ఈ పాటికి తలిదండ్రులు అక్కడికి వెళ్ళి ఉంటారండి.'

మేనేజరు మొహంలోని ఆగ్రహం మెత్తబడింది, తగ్గింది. 'మీరంతా వట్టి బ్రూట్స్. సైకిలెక్కితే ఏదో పెద్దనిషావచ్చేస్తుంది కాబోలు మీ అందరికీ. రోడ్లమీద పిల్లలు-అమాయకులైన పిల్లలు-ఉంటారనే ప్రాథమిక జ్ఞానం కూడా పోతుంది కాబోలు. ఇకనైనా జాగ్రత్తగా మసులుకో. నిన్ను క్షమించాను. నువ్వెళ్ళి నీపని చూసుకో. నామనసంతా అదోలా అయిపోయింది,' అన్నాడు మేనేజరు.

కాల్యాట్ చేసి వెనక్కి తిరిగి తోటేసుమూళ్ళల మధ్యకివచ్చిపడ్డాడు గంగాధరం పప





కుటుంబం మొత్తానికి ఒకే ఒక టాల్క్ పౌడర్

ఉత్సాహాన్ని రేకెత్తించే సువాసన గల ప్రోటెక్స్ నాణ్యమైన, సర్వ విధోపయోగమైన టాయిలెట్ పౌడర్ పెద్ద డబ్బాలో తక్కువ ధరకు లభ్యమౌతున్నది!

ఇండియా అంతటా వేలాది కుటుంబాలు సున్నితమైన సువాసనకు ప్రోటెక్స్‌నే ఎన్నుకుంటారు. అది అన్నివిధాలా ఉపయోగించడానికి వీలైనది కావడమే కారణము...

ఇప్పుడు సుందరమైన పఫ్‌తో సహా దొరకును!




ప్రొటెక్స్
సర్వోపయోగమైన
టాయిలెట్ పౌడర్

[illegible] కోల్గేట్ పామొలైవ్ తయారు

# ★ నిర్మల మొగుడు ★

ర్యంగా సహోసంగా. 'ఏం జరిగింది. ఏం జరిగింది,' అంటూ చుటూచేరి అడిగారు అందరూ. 'భాయ్. వీడు గంగాధరం. ఏమిటను కొన్నారో,' అంటూ నవ్వుతూ ఫైల్సు తీసే గంగాధరాన్ని ఏదో మహిమాన్వితుడిలాగ, హఠాత్తుగా అణిమాదిసిద్ధులు లభించిన యోగీశ్వరుడిలాగ వెర్రిగా చూశారు. మనసులో నే నిర్మలని తలచుకుని ధన్యవాదా లర్పించాడు గంగాధరం.


కలవరపడు స్త్రీలకు



"కుమారి" మాత్రలు మరువకండి. మీ ఆరోగ్యం రక్షించును. చింతఅవసరం లేదు. (సాదా) రు. 3/-
(స్పెషల్) రు. 5/-
(ఎక్స్ట్రా స్పెషల్) 8/-
పోస్టేజీప్యాకింగు ప్రత్యేకం

P. DEVEE & CO. (A.P.) Calcutta-40


ఈ ప్రమాదవార్త విని సగం డీలా అయిన మేనేజరు కాస్సేపట్లో తిరిగి కోలుకొని, ఒక్కసారి నిటూర్చి, తనపనిలో నిమగ్నుడయ్యాడో లేదో, గణగణమని టెలిఫోన్ మోగింది. తాపీగా చెవిదగ్గర పెట్టుకొని 'హలో' అన్నాడు. అవతల కొననుండి కంగారుగా భార్యగొంతు. 'ఏమండీ. మీరేనా. అయ్యో అరంటుగారండీ. ప్రమాదం అండీ. అబ్బాయికి ప్రమాదం జరిగిందండీ. ఎవడో సైకిలు మీదనుంచి తోసిచ్చాడండీ. తలంతా రక్తమండీ. త్వరగారండీ.'

మేనేజరు గుండె ఆగి, తిరిగి ఎగిరి గొంతుకలోకి అడ్డంగా వచ్చేసింది.

అతని మొహం తెల్లబడిపోయింది. మాటతణకింది. 'ఎవడా వెధవ-ఆ సైకిలు తొక్కిన వాడు?' అన్నాడు.

'ఆ దుర్మార్గపు వెధవ సైకిలు ఆపకుండా దిగకుండా రయ్యిమని తొక్కుకుని పారిపోయాడండీ వాడి కాళ్ళు విరగ—త్వరగా రండీ'

మేనేజరు చేతులూ కాళ్ళూ ఆడలేదు. 'బతికే ఉన్నాడా.' అని ఒక్క కేక పెట్టాడు ఫోన్‌లోకి.

'అవేం మాటలండీ. మీరు మరీనూ. తల మీద గాయంపడింది. అంతే. గాయం కడిగి గుడ్డతో కట్టాను. మన డాక్టరికి ఫోన్‌చేస్తే లేడు. ఇంకొక డాక్టర్ని ఎవరినేనా వచ్చేటప్పుడుతీసుకురండి. నెత్తురింకా కొంచెంగా వస్తోనే ఉంది. ఆలస్యం చెయ్యకండి' అంది ఆవిడ.

మేనేజరు కిప్పుడు శ్వాస ఆడింది. కాని క్షణంలో అతని మొహం కోపంతో కందగడ్డలా అయిపోయింది. కోటు చేత్తో తీసుకుని ఆఫీసు గదిలోంచి యివతలకివచ్చి గంగాధరంకేసి నిశంకన్నుతూ చూశాడు.

'ఏయ్—యిలారా."

ఆ పిలుపుకీ చూపుకీ గతుక్కుమన్నాడు గంగాధరం. 'సార్' అన్నాడు దగ్గరగా వచ్చి.

'నువ్వేనరిమీదనుంచి తోసిచ్చావో తెల్సునా సైకిల్నీ.?

గంగాధరం ఏమిటన్నట్టు వెర్రిగా చూశాడు.

'మా అబ్బాయిమీదనుంచి. లేక లేక కలిగిన నా ఒక్క కొడుకుమీదనుంచి. మాఆవిడ యిప్పుడే ఫోన్ చేసింది. పైగా ఆగకుండా పారిపోయావుట. నీ అంత నీచుడూ, దుష్టుడూ, అల్పుడూ, అధముడూ ప్రపంచంలో ఉండడు. నా మీద నీకున్న గడ్డ మూలాన్ని చెయ్యాలని చేసినట్టు కనపడుతోంది. నిన్ను అరెస్టు చేయించాలి న్యాయానికి. కాని నీపాపం నిన్నే కొడుతుంది. నిన్ను డిస్మిస్ చేశాను. ఫో. ఆఫీస్‌లోంచి ఫో—' అంటూ మేనేజరు ఊగిపోయాడు కోపంతో.

గంగాధరం ఏమీ అర్థంకాక గుటక మింగాడు. 'సార్' అనబోయాడు.

'నువ్వేం చెప్పనక్కర్లేదు. ఇంకొక నిముషం ఎదురుగా ఉంటే నిన్నేం చేస్తానో నాకే తెలీదు. ఏమయ్యా హెడ్‌గుమాస్తా. ఇతనికి ఏదేనా యివ్వవల్సినది ఉంటే తక్షణం యిచ్చిపంపెయ్యి. మళ్ళీ నా కళ్ళకి కనపడ్డావంటే అరెస్టు చేయిస్తాను. జాగ్రత్త అంటూ పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ అధికారి వెళ్ళిపోయాడు.

కాస్సేపటికి వెర్రివాడిలాగ, సర్వం పోగొట్టుకొన్న వాడిలాగ మూర్తీభవించిన శోకంలాగ వచ్చిన గంగాధరాన్ని చూసి కళవళపడింది నిర్మల. అతని నోటినుండి జరిగిన కథ విని నిశ్చేష్టురాలైంది. జాలిగా, తల రెండు చేతుల్తో పట్టుకుని కుర్చీలో కూర్చున్న గంగాధరాన్నీ, అతని అందమైన మొహం మాపపడే నల్లని వంకీల జుట్టునీ చూసేటప్పటికి ఆమె కనుకొలకుల్లో తెల్లని నీటిబిందువు తళతళలాడింది. ★


చీకటిలో మీ సహవాసి




మీ బేటరీ లైటు
నమ్మకముగా వెలుగుటకు ఎల్లప్పుడూ
ఎస్ట్రెలా బేటరీ వుపయోగించండి
అది చాలాకాలము వరకు ఎక్కువ
ప్రకాశవంతమైన వెలుగునిచ్చును.




ఎస్ట్రెలా బేటరీస్ లిమిటెడ్
బొంబాయి - మద్రాసు - ఢిల్లీ - కలకత్తా - కాన్పూరు
E 22